


పోలీసు సేవలను సద్వినియోగించుకోవాలి: డీఎస్పీ

తాంసి, మార్చి7: పోలీసుల సేవలను ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ డీఎస్పీ లక్కిరెడ్డి జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రిఆయన తాంసి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీచేశారు. పోలీసుల పనితీరుపై పర్యవేక్షించారు. పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఫైళ్లను పరిశీలించారు. పోలీసులు ప్రజలకు చేస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు వస్తే వారిపై నిఘా ఉంచాలన్నారు. ముఖ్యంగా ప్రతి వీధిలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని కోరారు. అనంతరం గ్రామస్థులు డీఎస్పీని సన్మానించారు.

ఎనిమిదేళ్లు గడిచినా.. ఎకరం తడవలే!


కోరాట - చనకా బ్యారేజీ

- పలుమార్లు గడువు పెంచిన ముందుకు సాగని పనులు
- నిధుల కొరతతో నిలిచిపోయిన కాల్వల భూసేకరణ పనులు
- పెండింగ్ పనులను చేపట్టేందుకు ఇదే అనువైన సమయం
- నిర్మాణం పూర్తయిన నిరుపయోగంగానే కోరాట - చనకా
- కొత్త ప్రభుత్వం పైనే ఆశలు పెట్టుకుంటున్న ఆయకట్టు రైతులు

ఆదిలాబాద్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర - జిల్లా సరిహ ద్దుల్లో లోయర్ పెన్‌గంగా ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన కోర్టా - చనకా బ్యారేజి నిర్మాణం పనులు దాదాపుగా పూర్తయిన నిరుపయోగంగానే మారింది. ఎనిమిదేళ్లుగా ఎకరం ఆయకట్టుకు సాగునీటిని అందించిన దాఖలాలు కనిపించడం లేదు. జి ల్లా సరిహద్దుల్లో పెన్‌గంగా నదిపై నిర్మిస్తున్న కోర్టా - చనకా బ్యారేజీ పనులకు నిధుల కొరత ప్రధాన ఆటంకంగా మారుతోంది. గత ఎనిమిదేళ్ల క్రితం రూ.386 కోట్ల అంచనా వ్యయంతో లోయర్ పెన్‌గంగా ప్రాజెక్టు పనులకు గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో సుమారుగా 51వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. ఇప్పటికే పనుల గడువు సమయం ముగిసిన 5 నుంచి ఆరుసార్లు పొడగించిన ఆశించినా ఫలితం కనిపించడం లేదు. బ్యారేజీ నిర్మాణం, హత్తిఘాట్ పంప్‌హౌజ్ పనులు దాదాపుగా పూర్తి దశకు చేరుకున్న కాలువల నిర్మాణం పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతూనే ఉంది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలకు ముందుకొంత హడావుడి చేసిన అధికారులు ఆగ మేఘాల మీద పంప్‌హౌజ్ వెట్ రన్ నిర్వహించి నిర్లక్ష్యంగానే వదిలేశారు. అప్పటినుంచి అటు వైపుచూసిన దాఖలాలే కనిపించడం లేదు. ప్రధానంగా నిధుల విడుదలలో గత ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తూ వచ్చింది. గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కోర్టా చనకా బ్యారేజీని సందర్శించి పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అయిన ప్రయోజనమే లేకుండా పోయింది. అంతలోనే ఎన్నికలు రావడం, ప్రభుత్వాలు మారడంతో కొరటా - చనకా బ్యారేజీపై పట్టింపే లేకుండా పోయింది. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పైననే ఆయకట్టు రైతులు భారీ ఆశలు పెట్టుకుంటున్నారు.

అంచనా పెంచినా ఏం లాభం?

అంచనా వ్యయాన్ని పెంచిన ప్రయోజనమే లేకుండా పోయింది. మొదట రూ.386కోట్ల అంచనా వ్యయంతో బ్యారేజి నిర్మాణం పనులను ప్రారంభించారు. గత ప్రభుత్వం దీనిని రూ.765కోట్ల అంచనా వ్యయాన్ని పెంచుతూ ప్రత్యేక జీవోను జారీ చేసింది. ఇందులో దుమ్ముగూడెం నుంచి తరలించిన మోటారు పంపుల విలువ రూ.110 కోట్లు, సబ్‌స్టేషన్, విద్యుత్ టవర్ లైన్‌ల పనుల కోసం రూ.60కోట్లు, 12శాతం జీఎస్టీ, పెరిగిన ధరల విలువ, మహారాష్ట్ర వైపు నిర్మించాల్సిన పనులకు నిధుల కేటాయింపు, ప్రభుత్వ డిపాజిట్లు, పంపుమోటారు డిజైన్ మార్పు, గేట్ల సామర్థ్యం పెంపు లాంటి పనులకు అంచనా వ్యయాన్ని పెంచుతు రాష్ట్ర ప్రభుత్వం అప్పట్లో నిర్ణయం తీసుకుంది. సుమారుగా ఇప్పటికి 150కోట్ల వరకు నిధులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. రూ.50కోట్లు, విద్యుత్ టవర్ పనులకు రూ.20కోట్లు, మరో రూ.80కోట్ల వరకు భూసేకరణకు చెల్లించాల్సి ఉందని అధికారిక లెక్కల ప్రకారం తెలిసింది. నిర్మాణ పనులను చేపట్టిన గత ప్రభుత్వం ప్రారంభించకుండానే అధికారానికి దూరమైంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఈ బ్యారేజీ నిర్మాణం పనులపై ప్రత్యేక దృష్టిని సారించాలని రైతులు కోరుతున్నారు.

అసంపూర్తిగానే పనులు

కాలువల నిర్మాణం పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. భూసేకరణలో తీవ్ర జాప్యం జరుగుతుంది. దీంతో ఆయకట్టుకు సాగునీరు అందించడం కష్టంగానే మారింది. సర్వే పనులను పూర్తిచేసిన ప్రభుత్వం నిధులను మంజూరు చేయకపోవడంతో కాలువల నిర్మాణం పనులు అర్ధాంతరంగానే నిలిచిపోయాయి. పనులు చేపట్టేందుకు వేసవికాలం అనుకూలమైన నిధుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అసలే నల్ల రేగడి నేలలు కావడంతో చిన్న పాటి వర్షాలకే బురదమయమై పనులకు అడ్డంకులు ఎదురవుతాయి. దీంతో మరో యేడాది పాటు ఎదురు చూడాల్సి వస్తుంది. ప్రధాన, ఉపకాల్వల పనులు పూర్తిగా నిలిచి పోవడంతో సాగునీటికి అవకాశం లేకుండా పోయింది. కాల్వలో నిల్వ ఉన్న వర్షపు నీటితోనే కొంత మంది రైతులు పంటలకు సాగునీటిని అందించుకుంటున్నారు.బ్యారేజీ, హత్తిఘాట్ పంప్‌హౌజ్ పనులు పూర్తయిన కాల్వల పనులు పూర్తికాక పోవడంతో ఎలాంటి ప్రయోజనం లేదంటున్నారు.ఇప్పటికే పంపు మోటార్లను బిగించినా మరమ్మతులు కొనసాగుతున్నాయి. కేవలం ఎన్నికల సందర్భంగానే వెట్ రన్‌ను నిర్వహించి వదిలేయడంపై సర్వత్రా తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

త్వరలోనే పనులను చేపడతాం..

● రవీందర్, ఈఈ లోయర్ పెన్‌గంగా, ఆదిలాబాద్

కోరాట - చనకా బ్యారేజీకి సంబంధించిన పెండింగ్ నిధులపై ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక ఇచ్చాం. నిధులు మంజూరుకాగానే పనులు చేపడతాం. కొంతమేరకు కాల్వల నిర్మాణం పూర్తయితే హత్తిఘాట్ ద్వారా ఆయకట్టుకు సాగునీటిని అందించే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలురాగానే పనులు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే గత ప్రభుత్వ హయంలోనే అంచనా వ్యయాన్ని పెంచడం జరిగింది. నిధులు మంజూరు కాగానే పెండింగ్ పనులు చేపడతాం.




ధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగురామన్న

ఎల్ఆర్ఎస్‌కు ఫీజు వసూలు చేయొద్దు

● మాజీ మంత్రి జోగు రామన్న ● కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి7: పేద, మధ్యతరగతి కుటుంబాలపై భారం వేయకుండా ఎల్ఆర్ఎస్ ఫీజును ప్రభుత్వమే భరించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లాఅధ్యక్షుడు జోగురామన్న అన్నారు. కాంగ్రెస్ తీరుకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఎల్ఆర్ఎస్ ఉచితం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగురామన్న మాట్లాడుతూ ఎన్నికల కంటే ముందు ఎల్ఆర్ఎస్‌కు ఫీజు ఉండదని ప్రకటించారని తెలిపారు. కానీ ఇప్పుడు ఎల్ఆర్ఎస్‌కు ఫీజులు అడుగుతున్నారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా 25లక్షల మంది ఉంటే, జిల్లాలో 19వేల 430 మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. వీరిపై నిలదీస్తామన్నారు. శ్రేణులుకూడా గ్రామాల్లో పర్యటిస్తూ గృహజ్యోతి ఎంతమందికి వర్తిస్తుంది.. గ్యాస్ సబ్సిడీ ఎంత మందికి పడిందో తెలుసుకోవాలన్నారు. కాంగ్రెస్ అబద్దాలపై బీఆర్ఎస్ ఉద్యమిస్తుందని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ, మున్సిపల్ చైర్మన్లు మనోహర్, జోగు ప్రేమేందర్, వైస్‌చైర్మన్ జమీర్‌రంజాని, నాయకులు ఉన్నారు.

డీసీసీ మాజీ అధ్యక్షుడిపై సస్పెన్షన్ ఎత్తివేత

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 7: జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడు భార్గవ్‌దేశ్‌పాండేపై సస్పెన్షన్‌ను ఎత్తి వేస్తూ కాంగ్రెస్ పార్టీ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. గతేడు నవంబరు 24న భార్గవ్‌దేశ్‌పాండేను సస్పెండ్‌చేస్తూ పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. రెబల్ అభ్యర్థికి అంతర్గతంగా మద్దతు ఇచ్చారన్న ఆరోపణలతో వేటు పడింది. వాస్తవ విషయాలను పరిగణలోకి తీసుకున్న అధిష్ఠానం పెద్దలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ వ్యవహారాల రాష్ట్ర ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షి సూచనలతో భార్గవ్‌దేశ్‌పాండేపై సస్పెన్షన్‌ను ఎత్తి వేస్తూ కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన వర్గీయులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో అండగా నిలిచిన భార్గవ్‌దేశ్‌పాండే సేవలు పార్టీకి ఎంతో అవసరమని ఆయనవర్గీయులు పేర్కొంటున్నారు. భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి తనవంతు సహకారం ఉంటుందని వాస్తవవిషయాలను పరిగణలోకి తీసుకుని సస్పెన్షన్ వేటు ఎత్తి వేయడంపై కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

'104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి7: 104 ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని 104 ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి నవీన్‌కుమార్ అన్నారు. గురువారం ఉద్యోగులతో కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నానిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఈ సందర్భంగా 104 ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి నవీన్ మాట్లాడుతూ గత 16 ఏళ్లుగా 104లో సేవలు అందిస్తున్న తమకు ప్రభుత్వాలు గుర్తించడం లేదన్నారు. బేసిక్ పే ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆశన్న, కిరణ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి: ఎస్సై

నేరడిగొండ, మార్చి 7: గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. కుప్టి గ్రామంలోని తెలంగాణపార్కులో నేరడిగొండ ఎస్సై శ్రీకాంత్ మొక్క నాటారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజుయాదవ్,ఉప సర్పంచ్ నరేష్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ మందుల రమేష్, వీడీసీ చైర్మన్ శ్రీధర్,మాజీచైర్మన్ నవీన్‌చారి, బాధ వెంకటరమణ, కళ్లెంభోజన్న, నక్కనరేష్, తదితరులు ఉన్నారు.

వైన్స్‌లో దొంగతనం

తాంసి, మార్చి7: మండల కేంద్రంలోని వైన్స్‌లో బుధవారం రాత్రి దొంగతనం జరిగింది. కొద్దిరోజులుగా వైన్స్‌లో తరుచూ దొంగతనం జరుగుతున్నా అందులోని సిబ్బంది బయటకు పొక్కనేయలేదు. దీంతో మాటువేసి దొంగతనానికి పాల్పడ్డ నలుగురిని పట్టుకుని పోలీసులకుఅప్పగించారు. సుమారు రూ.30వేల రూపాయల మద్యాన్ని దొంగిలించినట్లు తెలిసింది.

నూతన సీఐ బాధ్యతల స్వీకరణ

ఉట్నూర్, మార్చి7: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలీసు ఉన్నతాధికారుల బదిలీలు జరుగుతున్నాయి. ఉట్నూర్ సీఐగా పని చేసిన రామకృష్ణ కరీంనగర్ జిల్లాకు బదిలీ కాగా కరీంనగర్ జిల్లాలో పనిచేస్తున్న సీఐ జి.మొగిలిని ఉన్నతాధికారులు ఉట్నూర్ సీఐగా బదిలీచేశారు. గురువారం సీఐ మొగిలి బాధ్యతలు చేపట్టిన అనంతరం డీఎస్పీ నాగేందర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కొత్తగా వచ్చిన సీఐ మొగిలికి ఉట్నూర్ ఎస్సై మనోహర్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి

● కలెక్టర్ రాజర్షిషా

ఇంద్రవెల్లి, మార్చి7: అర్హులైన ప్రతీఒక్కరికి ప్రభుత్వ గ్యారంటీ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయానికి తనిఖీ చేశారు. ప్రజాపాలన దరఖాస్తుల డేటా నమోదును పరిశీలించి దిశానిర్దేశం చేశారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టిందని, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా పథకాలను అమలు చేస్తుందని, లబ్దిదారుల ఎంపికకు మార్గదర్శకాలు జారీ చేసిందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి దరఖాస్తును ఆమోదించి దరఖాస్తుదారులకు న్యాయం చేయాలన్నారు. తిరస్కరణకు గురైన దరఖాస్తులకు కారణం పొందుపర్చాలన్నారు. తెల్లరేషన్ కార్డు, ఆధార్ సంఖ్య, గ్యాస్ కనెక్షన్ నెంబర్ విద్యుత్ మీటరు నెంబర్ ప్రజాపాలన దరఖాస్తుల్లో సమర్పించిన వారందరికీ పథకాలు అమలవుతాయని తెలిపారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు కూడా ప్రజాపాలన సేవా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని వివరించారు. దరఖాస్తుల డేటా నమోదులో ఏమైనా సమస్యలు వస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్త, ఉట్నూర్ ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో కె.భాస్కర్, పంచాయితీ ఈవో సంజీవరావు తదితరులు ఉన్నారు.



నాగోబాను దర్శించుకున్న కలెక్టర్

ఇంద్రవెల్లి, మార్చి7: ఆదివాసీల ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబా దేవతను కలెక్టర్ రాజర్షిషా గురువారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకటరావు ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి నాగోబా చిత్రపటాన్ని బహుకరించారు. నాగోబా ఆలయ విశిష్ఠతను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ఆదివాసీ గిరిజన అమరవీరులస్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

నేరడిగొండ, మార్చి7: మండలకేంద్రంలో పార్టీకార్యాలయంలో ఆడే గజేందర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కానిందేఉద్దవ్‌ని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మండలంలోని దంసతండా గ్రామానికి చెందిన లింగుపటేల్ కోడలు మరణించడంతో కాంగ్రెస్ నాయకులు వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు పాలశంకర్, జనార్ధన్, మధుకర్, రావు, బసన్‌దాస్ ఉన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి7: పట్టణంలోని సిద్దివినాయక టాక్సీడ్రైవర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే పాయలశంకర్ ప్రారం భించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవి కాలంలో చలివేంద్రం అందరికీ ఉపయోగడపుతుందని అన్నారు. అలాగే గతంలో వారికి ఇచ్చిన మాట ప్రకారం అసోసియేషన్ సభ్యులకు సొంత ఖర్చుతో రూ.10లక్షల బీమాచేసి పత్రాలను అందించారు. కార్య క్రమంలో పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాండ్లు కొనుగోలు చేసినవారి పేర్లు బయట పెట్టాలి

● డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజారెడ్డి ● ఎలక్టోరల్ బాండ్లకు వ్యతిరేకంగా ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట కాంగ్రెస్ నాయకుల ధర్నా

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి7: ఎలక్టోరల్ బాండ్లకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నాయకులు, కార్యకర్తలు శివాజీచౌక్‌లోని ఎస్‌బీఐబ్రాంచ్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజారెడ్డి మాట్లాడుతూ 2018లో నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-బాండ్ల ద్వారా బీజేపీకే అత్యధిక లబ్ధిచేకూరిందని అన్నారు. బాండ్లు కొనుగోలు చేసిన వారిపేర్లు బయటపెట్టాలని సుప్రీంకోర్టు ఆదేశించినా ఎస్‌బీఐ తాత్సారం చేస్తోందని మండిపడ్డారు. వెంటనే పేర్లు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎలక్టోరల్ బాండ్ల ద్వారా వసూలైన మొత్తంలో 55శాతానికి పైగా బీజేపీకే వచ్చాయని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి బుద్ధి చెబుతారని అన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని ఖచ్చితంగా కాంగ్రెస్ హస్తగతం చేసుకుంటామని ధీమావ్యక్తం చేశారు. ఇందులో డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నగేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మా సంతోష్, యాల్ల పోతారెడ్డి, బాయిన్‌వార్ గంగారెడ్డి, ఎంఎ షకీల్, మొహమ్మద్ రఫీక్, నిమ్మల ప్రభాకర్, బూర్ల శంకరయ్య, కొండూరి రవీ, మానేశంకర్, ఎంఎ ముఖీమ్, భోజారెడ్డి, పూసం ప్రభాకర్, రాజ్‌మొహమ్మద్, సుధాకర్‌గౌడ్, రమణ, షేక్ మన్సూర్, ప్రభాకర్, తలాచౌష్, అఖిల్, షాదబ్, మహిళ నాయకులు ఉయిక ఇందిరా, లత,మీరాబాయి, తదితరులున్నారు.


ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు


వడ్డాడిలో వెలిసిన మహా నరసింహ స్వామి

నేడు వడ్డాడిలో మహాయజ్ఞం

● శివ పార్వతులకు కళ్యాణం ● జాతర ప్రారంభం

తాంసి, మార్చి7: మండలంలోని వడ్డాడి గ్రామంలో ప్రసిద్ధిగాంచిన లక్ష్మీ నరసింహ ఆలయంలో నేడు మహాయజ్ఞం నిర్వహించనున్నారు. 101 జంటలు 21మంది వేదపండితుల మంత్రాల మధ్య ఈయజ్ఞాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. ప్రకృతి ప్రసాదంగా భావించే మహా పుట్ట ఈ ఆలయంలో వెలిసింది. అందులో ప్రతి సంవత్సరం మహాశివరాత్రి పండుగ పర్వదినం నాగుపాము దర్శనం ఇస్తూ ఉంటుంది. దీంతో ఆ ఆలయాన్ని సందర్శించుకునేందు కోసం వేలాది మంది భక్తులు తరలివస్తూ ఉంటారు. ఈ శివరాత్రిని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో జాతరను కూడా ప్రారంభించారు. జిల్లాకేంద్రం నుంచి వచ్చిపోయే వారి కోసం ఆర్టీసీ బస్సులతోపాటు ప్రైవేట్ వాహనాలను కూడా ఏర్పాటుచేశారు. పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం, శివపార్వతులకు కల్యాణం కూడా ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై శివపార్వతుల కళ్యాణాన్ని విజయవంతం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి7: మున్సిపల్ పరిధిలోని కాలనీల్లో నీటి ఎద్దడి లేకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే పాయలశంకర్ సూచించారు. గురువారం పట్టణంలోని ఫిల్టర్ బెడ్, మున్సిపల్ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న మున్సిపల్ వాటర్ సప్లయ్‌ను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే పాయలశంకర్ మాట్లాడుతూ శివారు ప్రాంతాల్లో, పట్టణంలోని కొన్ని కాలనీల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుందని ఎటువంటి ఇబ్బంది కలుగకుండా వారికి నీరు అందించే ప్రయత్నం చేయాలని అధికారులకు సూచించారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల మిషన్ భగీరథ కాంట్రాక్టర్ల అవినీతి వల్ల మిషన్‌భగీరథ పథకం పూర్తిగా నిర్వీర్యమైందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు, మిషన్ భగీరథ అధికారులు, బీజేపీ నాయకులు ఆకుల ప్రవీణ్, జోగురవి, రాజేశ్; సోమరవి, శ్రీనివాస్, కార్యకర్తలున్నారు.


ఫిల్టర్‌బెడ్‌లోని వాటర్ ట్యాంక్ సప్లయ్‌ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే


దీపాయిగూడలో ఎన్ఆర్ఈజీఎస్ పనులను ప్రారంభిస్తున్న అడ్డిభోజారెడ్డి

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు

● డీసీసీబీ బ్యాంక్ చైర్మన్ అడ్డి భోజారెడ్డి

జైనథ్, మార్చి7: ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతులు సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఆదిలాబాద్ జిల్లా డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి స్పష్టం చేశారు. గురువారం జైనథ్ మండలంలోని దీపాయిగూడ గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద రూ. 10లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్లు డ్రైనేజీ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జీ కందిశ్రీనివాస్‌రెడ్డి ద్వారా గ్రామాల అభివృద్ధికి రూ.5కోట్లను తీసుకువచ్చామని వివరించారు. కార్యక్రమంలో జైనథ్ జడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ లోక కరుణాకర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మా సంతోష్, గ్రామపెద్దల పోతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ఉట్నూర్, మార్చి7: ఉట్నూర్ మండలంలోని నాగాపూర్‌కు చెందిన సింగోరే యోగరాజ్ (35) మద్యం మత్తులో ఓ యువకుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఎస్సై మనోహర్ తెలిపారు. యోగరాజ్ ట్రాక్టర్ కూలీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మద్యానికి బానిసైన యోగరాజ్ రోజూ తాగి వచ్చి భార్య అనితతో గొడవ పడడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయిందని, దీంతో మరింత మద్యానికి బానిసైన యోగరాజ్ గురువారం మద్యం మత్తులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఎస్సై మనోహర్ తెలిపారు. అయితే ఉరేసుకునే ముందు తన తమ్ముడికి ఫోన్ చేసి ఉరేసుకుంటున్నానని, పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని కోరాడని యోగరాజ్ తమ్ముడు తెలిపినట్లు చెప్పారు. తర్వాత ఫోన్ స్విచ్ఆఫ్ చేశాయని పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మనోహర్ తెలిపారు.

నేడే మహాశివరాత్రి

● జిల్లావ్యాప్తంగా ముస్తాబైన శివాలయాలు ● ఆలయాల్లో విద్యుత్‌దీపాలతో ప్రత్యేక అలంకరణ


విద్యుత్‌కాంతులతో వెలిగిపోతున్న రవీంద్రనగర్‌లోని శివాలయం

ఆదిలాబాద్ అర్బన్, మార్చి7: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లావ్యాప్తంగా శివాలయాలు ముస్తాబయ్యాయి. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేయనున్నారు. జిల్లాలోని ప్రధాన శివాలయాలకు విద్యుత్‌దీపాలంకరణ చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాలకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా గంగపుత్ర శివాలయం, రవీంద్రనగర్‌లోని శివాలయంతో పాటు పెండల్‌వాడలో ఘనంగా నిర్వహించే శివాలయం వద్ద, రాంనగర్‌లోని మల్లికార్జున ఆలయం, సంజయ్‌నగర్, క్రాంతినగర్, సీసీఐ శివాలయాల్లో భక్తులు శుక్రవారం పెద్దఎత్తున పూజలు నిర్వహించనున్నారు.

● ముస్తాబైన శైవక్షేత్రాలు

భక్తులు భక్తిశ్రద్ధలతోపాటు ఉపవాస దీక్షలు చేపట్టి శివునికి మహాశివరాత్రి సందర్భంగా పూజలు నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లాలోని ఆలయాల కమిటీ సభ్యులు ఆలయాలను ప్రత్యేక ముస్తాబుచేశారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లపై దృష్టి సారించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కుమార్‌పేట్ శివాలయంతో పాటు రవీంద్రనగర్ శివాలయం, శ్రీరాంకాలనీలోని శివాలయం, సంజయ్‌నగర్ శివాలయం, క్రాంతినగర్‌లతో పాటువివిధ కాలనీల్లో, తలమడుగు మండలంలోని ఝరి శివాలయం, ఇచ్చోడ మండలంలోని సిరిసెల్మ శివాలయం, జైనథ్ మండలంలోని కోటి లింగాలు తదితర ఆలయాలకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేయనున్నారు. శివ భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టనున్నారు.

ప్రత్యేక పూజలకు సిద్ధమైన శివాలయాలు

ఉట్నూర్, మార్చి7: ఉట్నూర్ ఏజెన్సీలోని కాకతీయుల ఎలుబడి నాటి శివాలయంతోపాటు ఏజెన్సీలోని మరికొన్ని శివాలయాలు మహాశివరాత్రి ఉత్సవాలకు సిద్ధమయ్యాయి. ప్రతాపరుద్రుడు నిర్మించిన శివాలయంలో ప్రతియేటా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివాపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్నారు. అలాగే సాలెవాడలో స్వయంభుగా వెలిసిన మహాదేవ ఆలయంలో కూడా సాలెవాడ ప్రజలతోపాటు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి శివునికి అభిషేక పూజలు నిర్వహిస్తారు.

మహాశివరాత్రికి సిద్ధమైన శైవక్షేత్రాలు

జైనథ్: మండలంలోని బోరజ్, పెండల్‌వాడ ఆత్మలింగ హనుమాన్ ఆలయం, కోరట గ్రామంలోగల ఓం కారేశ్వర ఆలయాలు శుక్రవారం జరిగే మహాశివరాత్రి పర్వదిన వేడుకలకు ఆలయాలు సిద్ధమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయాలను వివిధ రంగురంగుల పూలవిద్యుత్ మేర్క్యూరీ బల్బులతో వివిధ రంగులపూలతో అలంకరించారు. మండలంలోని పెండల్‌వాడ ఆత్మలింగ హనుమాన్ ఆలయానికి సంబంధించిన గ్రామ సమీపంలోని ఏడుపాయాల నదిలో శివపార్వతుల కళ్యాణోత్సవంక, లింగోద్భవ కార్యక్రమం శివదీక్ష పరుల పూజలు నిర్వహించనున్నారు. అలాగే కోరట ఓంకారేశ్వర ఆలయంలో శ్రీరాముడు బస చేసి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. స్థలపురాణం ప్రకారం గోదక్షుడు అనే మహారాజు 500 ఏళ్ల క్రితం ఇక్కడ జీవ సమాధి అయ్యారు. దీంతోపాటు బోరజ్ శ్రీరామ శివపార్వతుల ఆలయాన్ని అన్ని హంగులతో వేడుకలకు సిద్ధం చేస్తున్నారు. భక్తులు అధికసంఖ్యలో కావాలని కోరుతున్నారు

శివా.. మహాదేవ!

● కోర్కెలు తీర్చే కొంగుబంగారం సిరిచెల్మ మల్లికార్జున స్వామి ఆలయం

● మహా శివరాత్రికి ప్రత్యేక పూజలకు ముస్తాబైన మల్లన్న ఆలయం

ఇచ్చోడ, మార్చి7: ప్రతీఏటా వచ్చే 12మాస శివరాత్రులలో మాఘబహుళ చతుర్ధశి పరమ శివునికి ప్రీతి పాత్రమైనదిగా, శనిత్రయోదశితో కూడిన మహాశివరాత్రి విశేషమైనదని విశ్వసిస్తారు. శివుడు జ్యోతిస్పటిక లింగాకారంలో శివరాత్రి అర్ధరాత్రి ఉద్భవించినట్లుగా పూరణాలు చెబుతున్నాయి. భక్తులు ఉపవాసదీక్షతో ప్రత్యేకపూజలు అర్చనలు, జాగరణలు చేయడం నేటిశివరాత్రి ప్రత్యేకత.



● పురాతన కట్టడం

చరిత్ర కలిగిన అతిపురాతన చెరువు.. ఎంతో విలువైన శిల్పసంపదకు నిలయం సిరిచెల్మ మల్లికార్జునస్వామి చారిత్రక ఆలయం. ఇచ్చోడ మండలం సిరిచెల్మ గ్రామంలోని విశాలమైన చెరువు మధ్యలో అందమైన మల్లికార్జునస్వామి(శివాలయం) ఉంటుంది.శతాబ్దాల కింద ఇక్కడ పరమశివుడు లింగరూపంలో వెలిశాడని స్థానికుల నమ్మకం. కాకతీయుల కాలంలో నిర్మించిన ఈ చారిత్రాక ఆలయానికి ఎంతో పవిత్రత ఉందని భక్తుల విశ్వాసం. చాలా మహిమ గల మల్లన్న అని భక్తులు మొక్కులు తీర్చుకుంటారు.

● కోర్కెలు తీర్చే కొంగుబంగారం సిరిచెల్మ మల్లన్న

సిరిచెల్మ మల్లికార్జున స్వామిను కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా భక్తులు పూజిస్తారు. ఆ ఆలయంలోకి వెళ్లగానే అపురూప శిల్పాలు, కళావైభవం మనసు దోచుకుంటాయి. సిరిచెల్మ గ్రామంలో 11వ శతబ్దంలో రాజరాజనరేంద్రుని కాలంలో నిర్మించినట్లు చెబుతారు.

● ఆలయ ప్రత్యేకతలు

ఈ ఆలయం నందీశ్వరుడి ముందు రెండు నందులు ఉంటాయి. మాఘమాసంలో ఎడు గదులను దాటి సూర్యకిరణాలు లింగంపై పడుతాయి. ఆలయంలో వీరభద్రుడు కొలువుదీరడంతో అగ్రిగుండాలు నిర్వహిస్తారు. వీటితోపాటు ఆలయంలో జైన, బౌద్ధ, వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, శనిదేవని విగ్రహాలు ఉండడం ఇక్కడి ప్రత్యేకత. సుదూర ప్రాంతాల నుంచి బౌద్ధులు వచ్చి పూజలు చేస్తారని అర్చకులు చేబుతున్నారు.

అన్నిరంగాల్లోనూ మహిళల భాగస్వామ్యం

● మహిళా కమిషన్ రాష్ట్ర సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి ● నేటి పొదుపుయే రేపటి భవిష్యత్తు: కలెక్టర్ రాజార్షిషా



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్



ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా కలెక్టర్, అధికారులు

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి7: ఇంటితోపాటు కార్యాలయ పనులు ఇలా అన్నిరంగాల్లోనూ మహిళలు సమర్థవంతంగా బాధ్యతలను నిర్వహిస్తున్నారని తెలంగాణ మహిళా కమిషన్ రాష్ట సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం మహిళాదినోత్సవ వేడుకలను జడ్పీసమావేశ మందిరంలో నిర్వహించారు. మహిళాకమిషన్ సభ్యురాలితోపాటు కలెక్టర్ రాజర్షిషా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జాతీయ స్థాయి అర్చరీలో 5వ స్థానంలో నిలిచిన ఆదిలాబాద్‌రూరల్ మండలం చించుఘాట్ ఆశ్రమ పాఠశాల 9వ తరగతి విద్యార్థి టేకం లక్ష్మిని దనస్సును బహుకరించారు. అనంతరం విధులు సక్రమంగా నిర్వహించి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో కృషి చేసిన పలువురు అంగన్‌వాడీలకు నగదు పురస్కారాలను అందించారు. నేటి ప్రపంచంలో మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారన్నారు. అనంతరం కలెక్టర్ రాజార్షిషా మాట్లాడుతూ మహిళలు వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో పని చేస్తూ ప్రత్యేక స్థానాన్ని కల్పించుకున్నారు. ఇచ్చిన బాధ్యతలను పూర్తి చేస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందిస్తున్నారని కొనియాడారు. నేటి పొదుపుయే రేపటి భవిష్యత్తుకు ఉపయోగపడుతుందని ఆ దిశగా మహిళలు ఆలోచించాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి క్షమాదేశ్‌పాండే, డీడబ్ల్యుఓ సబిత, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపీపీ పంద్రజైవంతరావు ఆధ్వర్యంలో గురువారం ఘన్నూర్ గ్రామపంచాయతీ ఆవరణలో మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీపంద్రజైవంత్‌రావు మాట్లాడారు. సమాజాభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ,మాజీ సర్పంచ్ పంద్రలత ఐసీడీఎస్ సూపర్ వైజర్ మంజులత, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, ఆశావర్కర్లు అంగన్‌వాడీ, టీచర్లు వీఓ లీడర్లు, మహిళలు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవాన్ని కేక్‌కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. మహిళా పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ, మహిళా సిబ్బంది, ఎంపీడీవో కార్యాలయం మహిళా సిబ్బందిని శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్, ఎంపీపీ కేంద్రే జ్ఞానోబా, ఎంపీడీవో మహ్మద్ అబ్దుల్‌హై, ఎంపీవో సుధీర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాంసి: మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఉద్యోగాలతోపాటు రాజకీయాల్లోనూ మహిళలు రాణించాలని ఎంపీడీవో గడ్డం మోహన్‌రెడ్డి అన్నారు. అనంతరం మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గడ్డం మోహన్ రెడ్డి , సూపరింటెండెంట్ రవీందర్, ఎంపీపీ మంజుల, ఎంపీటీసీలు రేఖ , భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

సిరికొండ: తహసీల్దార్ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తహసీల్దార్ విజయ్‌కుమార్, డీటీ ఉపేందర్‌లు కార్యాలయ సిబ్బందితో కలిసి కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగి యాస్మిన్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు.

తలమడుగు: మండల కేంద్రంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందరర్భంగా పలువురు మహిళలను మెమోంటోస్ శాలువాతో సన్మానించారు. ఇందులో తహసీల్దార్ రాజమోహన్, ఎంపీపీ కళ్యాణలక్ష్మిరాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్, మార్చి7: మహిళా దినోత్సవం పురస్కరించుకుని మండల కేంద్రంలోని నాగభూషణం పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సునీతను సన్మానించారు.

'ఈఎండీ వాపస్ ఇప్పించండి'

నిర్మల్ కల్చరల్, మార్చి7: నిర్మల్‌లోని ఎస్సీ కార్పొరేషన్ ఖాళీ దుకాణ సముదాయాలకు దరఖాస్తు చేసే అభ్యర్థులకు వసూలు చేసే ఈఎండీ తిరిగి వాపస్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ దళిత మోర్చా అధ్యక్షుడు రాచకొండ సాగర్ ఈడీని ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు సమర్పించిన వినతిపత్రంలో 50 వేల ఈఎండీ, 5వేలు దరఖాస్తు రుసుము నిర్ణయించారని ఇది ఆర్థిక భారమవుతుందని పేర్కొన్నారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు ఉచిత శిక్షణ

నిర్మల్ కల్చరల్, మార్చి7: గ్రూప్-1 ప్రిలిమ్స్ కోర్స్ కోసం ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి వి.రాజేశ్వర్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు గడువు 12 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు డిగ్రీ కళాశాలలోని బీసీ స్టడీ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. కులం, ఆధార్, విద్యార్హత, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో హాజరు కావాలని కోరారు. బీసీ, ఎస్టీ, ఎస్సీ, ఈబీసీలు ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసు కోవచ్చునన్నారు.

విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలి

ఖానాపూర్, మార్చి 7 : విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ అలవర్చుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని మోటివేటర్ డాక్టర్ బోండ్ల రాజేందర్ అన్నారు. గురువారం మండలంలోని మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉత్తమ వ్యక్తిత్వం అలవర్చుకోవడం, ఉన్నత శిఖరాలకు ఎదగడం తదిత అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలను ఆయన వివరించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పే విషయాలపై విద్యా ర్థులు దృష్టి సారించుకపోవడంతో జరిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పుప్పాల స్వప్న, ప్రధానోపాధ్యాయులు ఇర్రి నరేందర్‌రెడ్డి, బి. నరేందర్, కె. శేఖర్, జె. శ్రీనివాస్, వి. అంజయ్య, కె. శ్రీనివాస్, గొల్లపెల్లి మారుతి, గంగాధర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

15న కడెంలో టీజేఎస్ పార్లమెంట్ స్థాయి సమావేశం

ఖానాపూర్, మార్చి 7 : ఈ నెల 15వ తేదీన కడెం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో తెలంగాణ జన సమితి ఆదిలాబాద్ పార్లమెంట్ స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కడపత్రి తిలక్ రావు తెలిపారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంను ఆయన నివాసంలో కలిసినట్లు తిలక్‌రావు ఆంధ్రజ్యోతికి ఫోన్‌లో వివరించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థాయి సమావేశం నిర్వహణ తదితర అంశాలపై చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం హాజరవుతున్నందున ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని టీజేఎస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

లక్ష్మణచాంద, మార్చి 7 : మండల కేంద్రంలోని రైతువేదికలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మహిళల కళాకృతులైన రంగవల్లులు వేయటంతో పాటు కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. డీఆర్డీవో విజయలక్ష్మితో పాటు తహసీల్దార్ జానకిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్, జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, సీడీపీవో నాగమణి, తహసీల్దార్ జానకి, ఎంపీడీవో రాంప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పసుపుల భాగ్యవతి, ఏపీఎం వాణిశ్రీ, ఏపీవో ప్రమీల, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ ఆధ్వర్యంలో స్వీప్‌పై అవగాహన

ముథోల్, మార్చి 7 : మండల కేంద్రమైన ముథోల్‌లోని మండలాభివృద్ధి కార్యాలయం ఆవరణలో సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రాం (స్వీప్) నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు విద్య, ఓటరుపై అవగాహనను కల్పించారు. రంగోలి, మెహందీ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేశారు. అలాగే ముందస్తు మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాములు, ఏపీఎం గురుచరణ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

ప్రశాంత ఎన్నికలకు.. రాజకీయ పార్టీలు సహకరించాలి

● నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్ కల్చరల్, మార్చి7: రాబోయే పార్లమెంట్ ఎన్నికలు నిర్మల్ జిల్లాలో ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కోరారు. గురువారం పార్టీ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూని ట్లు, వీవీ ప్యాట్ మొదటి విడత తనిఖీ పూర్తయిందన్నారు. ఇప్పటికే ఓటర్ల జాబి తాను పార్టీలకు అందజేశామని తెలిపారు. నియోజకవర్గాల వారీగా 6,7,8 ఫారాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి చిరునామా మార్పు, నకిలీ, మరణించిన ఓటర్లను తొలగించడం జరుగుతుందన్నారు. సమగ్ర ఓటరు జాబితాను రూపొందిం చేందుకు పార్టీలు సహకరించాలని కోరారు. డీఆర్‌వో గంగయ్య, ఆర్డీవో రత్న కళ్యాణి, పర్యవేక్షకుడు శ్రీనివాస్, పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బీజేపీ మెనిఫెస్టో వాహనం ప్రారంభం

నిర్మల్ కల్చరల్, మార్చి7: బీజేపీ మెనిఫెస్టో వాహనం గురువారం సోన్ మండల కేంద్రంలో పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్న గారి భూమయ్య ప్రారంభించారు. జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, నాయకులు రాంనాథ్, సామ రాజేశ్వర్‌రెడ్డి, రాచకొండ సాగర్, విలాస్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd, Adilabad branch, agreed to accord loan to Borrower : ABUBAKAR BIN MOHAMMAD S/o. SHAIK MOHAMMED,R/o H.No: 6-8-88/1, Bhukthapur, Mandal & Dist. Adilabad. Property holder : AYESHA SIDDIQA W/o ABUBAKAR BIN MOHAMMAD R/o H.No:6-8-88/1, Bhukthapur, Mandal & Dist. Adilabad. R/o by mortgage of the schedule property mentioned below. The above propective loan agreed to create first charge against property mentioned below infavour of my client company. If any person having any title, claim, or objection of what so ever nature may put forth their claims before me within 7 days of this notice. The objection raised afterwards shall be deemed to be "Waived" and not binding on my clait company and my client shall proceed further for according above loan.

SCHEDULE

The House bearing Municipal Door No. 2-1-116 (New), 2-2-34 (Old), admeasuring 30'x30' = 900.00 Sq fts = 100.00 Sq Yards = 83.64 Sq Mtrs, Out of Which Plinth area of RCC roof Ground floor 531.00 Sft, First floor 535.00 Sft & Second floor 358.00 Sft, and G.I Sheet area of 150.00 sft, In Sy.No.86. Assessment No.1094002886. Situated at Ward No.2, Block No.1, Bokkalguda, Adilabad. Within the limits of Adilabad Municipality, Dist. Adilabad, Under the jurisdiction of Registration District & Sub-District Adilabad

Bounded as follows: East: House of Baba, West: Lane., North: House of Shaik Asif MPL House No.2-1-116/1, South: Road

Sd/- BIPIN KUMAR PATEL Advocate, Adilabad. Cell: 9440005500

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/S Shriam Finance Ltd, Adilabad branch, agreed to accord loan to Borrower & Property Holder : PADMA @ KANTHI PADMA W/o KANTHI ASHOK R/o H.NO: 3-3-476, Mahalaxmiwada, Mandal & Dist. Adilabad. R/o by mortgage of the schedule property mentioned below. The above prospective loanee agreed to create first charge against property mentioned below infavour of my client company. If any person having any title, claim, or objection of what so ever nature may put forth their claims before me within 7 days of this notice. The objection raised afterwards shall be deemed to be "Waived" and not binding on my client company and my client shall proceed further for according above loan.

SCHEDULE

The Part of Plot No.57, Total measuring = 30'x40' = 1200.00 Sq fts. Out of which Sold area Measuring 20'x30' = 600.00 Sft = 66.66 Sq.Yards = 55.74 Sq.Mtrs, In Sy No.75/1 & 75/2. Situated at Revenue Village Adilabad. Mandal & Dist Adilabad. Within the limits of Adilabad Muncipality, Under the jurisdiction of Registration District & Sub-District Adilabad.

Bounded as follows:

East: Remaining Plot No.57, West: 20' Wide Road, North: Plot No.56, South: 20' Wide Road.

Sd/- BIPIN KUMAR PATEL Advocate, Adilabad. Cell: 9440005500

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd, Adilabad branch, agreed to accord loan to Borrower & Property Holder : ZAMEER KHAN S/o. RAHEMAN KHAN, R/o H.NO: 2-84, Village & Mandal Mavala, Dist.Adilabad. R/o by mortgage of the schedule property mentioned below. The above prospective loanee agreed to create first charge against property mentioned below infavour of my client company. If any person having any title, claim, or objection of what so ever nature may put forth their claims before me within 7 days of this notice. The objection raised afterwards shall be deemed to be "Waived" and not binding on my client company and my client shall proceed further for according above loan

SCHEDULE OF PROPERTY NO.1

The Open Plot Allotted G.P. Door Nos.2-83 & 2-84 (old), New G.P. Door No.2-83/3 (New), Total measuring 13860 Sft. Out of which Registration area 1380 Sft = 153.33 Sq.Yards = 128.20 Sq Mtrs, Situated at Village ,G.P. & Mandal Mavala, Dist Adilabad, within the jurisdiction of Registration District & Sub-District Adilabad.

Bounded as follows: East: Reamaining Open place of Zahoor Khan, West: Reamaining Open place of Zahoor Khan, North: Road & Anil, South: Lane of Rajamouli.

SCHEDULE OF PROPERTY NO.2

The Open Plot Allotted G.P. Door Nos. 2-83 & 2-84 (old), New G.P. Door No.2-83/3 (New), Total measuring 13860 Sft. Out of which Registration area 930 Sft = 103.33 Sq.Yards = 86.39 Sq Mts, Situated at Village ,G.P. & Mandal Mavala, Dist Adilabad, within the jurisdiction of Registration District & Sub-District Adilabad.

Bounded as follows: East: N.H. No.7, West: Remaining Open Place of Arif Khan, North: Remaining Open Place of Zahoor Khan, South: Remaining Open Place of Zaheer Khan.


Sd/- BIPIN KUMAR PATEL Advocate, Adilabad. Cell: 9440005500

andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గురువారం ఉష్ణోగ్రత గరిష్టం 37.2 కనిష్టం 22.7





రంగుమారనున్న రాజకీయం

- జిల్లాలో జోరుగా పాలి'ట్రిక్స్'
- పార్టీ ఫిరాయింపులపై అంతటా ఊహాగానాలు
- బీఆర్ఎస్ పార్టీలో మొదలైన దడ
- సీనియర్‌లపై పార్టీ మారాలంటూ ఒత్తిడి తీసుకువస్తున్న జూనియర్‌లు
- వేచిచూద్దామంటూ సర్దిచెబుతున్న నాయకులు
- ససేమిరా అంటున్న కేడర్

నిర్మల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రాజకీయ సమీకరణలు పెద్దఎత్తున తలకిందులు కాబోతున్నట్లు ఊహాగానాలు మొదలయ్యాయి. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డితో పాటు ముథోల్ నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డిలు కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నట్లు జోరుగా సాగుతున్న ప్రచారం అంతటా చర్చనీయాంశంగా మారుతోంది. మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అనుచరుడు, సిర్పూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బీఆర్ఎస్ పార్టీకి గట్టి షాక్‌నిచ్చి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీని కుదిపేస్తోంది. కోనప్ప వ్యవహారంపై అంతటా చర్చ జరుగుతున్న నేపథ్యంలోనే మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కూడా పార్టీ మారబోతున్నారన్న ప్రచారం అంతటా హాట్‌టాపిక్‌గా మారుతోంది. ఈ క్రమంలోనే గురువారం ఇంద్రకరణ్‌రెడ్డి ఇంట్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు చర్చ లు జరిపిన అంశం బీఆర్ఎస్ పార్టీని కుదిపేస్తోంది, ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఇంద్రకరణ్‌రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలతో సీరియస్‌గా జరిపిన మంతనాల వ్యవహారం దుమారం సృష్టిస్తోంది. అయి తే ఈ సందర్భంగా పార్టీ మారాలంటూ ఇంద్రకరణ్‌రెడ్డిపై నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఒత్తిడి తీసుకువచ్చారు. బీఆర్ఎస్ పార్టీ విధానాలపై ప్రజలంతా ఆగ్రహంతో ఉన్నారని ఆ పార్టీలో కొనసాగితే తమకు రాజకీయ భవిష్యత్ ఉండబోదంటూ ఇంద్రకరణ్‌రెడ్డి ఆ పార్టీ కేడర్ వాపోయారు. పార్టీ మారాల్సిందేనంటూ వారు పట్టుబట్టారు. అధికారం లో ఉన్న కాంగ్రెస్ పార్టీలో చేరితే తమను నమ్ముకున్న కేడర్‌కు న్యాయం జరుగుతుందని వారంతా స్పష్టం చేశారు. అయితే కార్యకర్తల ఒత్తిడిపై మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అక్కడికక్కడే స్పందించకుండా వేచి చూద్దామంటూ సర్దిచెప్పే ప్రయత్నం చేశారంటున్నారు. కాగా బీఆర్ఎస్ పార్టీని వీడేది లేదని మాత్రం స్పష్టంగా చెప్పలేదని, దీని కారణంగానే ఆయన పార్టీ మారే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయంటున్నారు. కార్యకర్తలు తన మనోఅభిప్రాయాలను వెల్లడిస్తున్నంత సేపూ ఇంద్రకరణ్‌రెడ్డి శ్రద్ధగా విన్నారే తప్ప వారికి అడ్డు చెప్పడం గాని, వారి వాదనలను ఖండించడం గాని చేయలేదంటున్నారు. ఈ పరిణామాలను పరిశీలించిన చాలా మంది సీనియర్ కేడర్ ఇంద్రకరణ్‌రెడ్డి పార్టీ మారేందుకు సిద్ధమవుతున్నారని బహిరంగంగా పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ముథో ల్ మాజీ ఎమ్మెల్యే, జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు విఠల్‌రెడ్డి ఇప్పటికే కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఓ నిర్ణయం తీసుకున్నారంటున్నారు. ఆయన అనుచరులు, కార్యకర్తలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నారు. అయితే విఠల్‌రెడ్డి మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సన్నిహితుడు కావడంతో వీరిద్దరు పథకం ప్రకారమే బీఆర్ఎస్ పార్టీని వీడేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నారంటున్నారు. అలాగే ఖానాపూర్ నియోజకవర్గానికి చెందిన మరికొంతమంది బీఆర్ ఎస్ పార్టీ నాయకులు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సంకేతాలు పంపుతున్నారని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం వీరందరి ప్రతిపాదనలను పరిశీలనలోకి కూడా తీసుకుందని ఒకటి రెండు రోజుల్లో అధిష్ఠానం తన నిర్ణయాన్ని వెల్లడించనుందంటున్నారు. ఇదే జరిగితే జిల్లాలో బీఆర్ ఎస్ పార్టీ ఇక కనుమరుగయ్యే పరిస్థితులు సైతం ఏర్పడవచ్చంటున్నారు.

మాజీ మంత్రి నిర్ణయమే కీలకం

పార్టీ మారే విషయంలో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తీసుకోబోయే నిర్ణయం కీలకం కానుందంటున్నారు. గత కొద్దిరోజుల నుంచి ఇంద్రకరణ్‌రెడ్డి పార్టీ మారబోతున్నారని, కాంగ్రెస్ పెద్దలతో చర్చలు సైతం జరిపారంటూ వస్తున్న కథనాలను ఆయన ఖండించకపోవడం అనుమానాలకు బలం చేకూరుస్తోందని అంటున్నారు. ఇప్పటి వరకు తెరవెనక మాత్రమే ఈ కార్యకలాపాలు జరిగాయని ఒకటి రెండు రోజుల్లో బహిరంగంగా పార్టీ మారే కార్యకలాపాలు మొదలుకావచ్చంటున్నారు. ఇంద్రకరణ్‌రెడ్డి నిర్మల్ నియోజకవర్గంతో పాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలను వెంట పెట్టుకొని కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశాలున్నాయంటున్నారు. మాజీ మంత్రికి సన్నిహితుడైన ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఈ వ్యవహారంలో కీలకపాత్ర పోషిస్తున్నారంటున్నారు. కొంతమంది కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అడ్డు తగులుతున్నారన్న ఆరోపణలున్నాయి. దీనిపై కూడా ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత రాలేదంటున్నారు.

జిల్లా అధ్యక్షుడి వ్యవహారంపై కూడా చర్చ

బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి గత కొద్దిరోజుల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారంటున్నారు. మొన్నటి ఎన్నికల్లో ఓటమి చెందిన నాటి నుంచి విఠల్‌రెడ్డి తన అనుచరులు, కార్యకర్తల ముందు బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం తీరుపై అసహనం వ్యక్తం చేశారంటున్నారు. ఈ క్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనపై పెద్దఎత్తున ఒత్తిడి తీసుకు వచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరాలంటూ సూచిస్తున్నట్లు సమాచారం. జిల్లా అధ్యక్షుని హోదాలో పార్టీ మారితే ప్రభావం ఎక్కువగా ఉంటుందంటున్నారు. దీని దృష్ట్యానే కాంగ్రెస్ పెద్దలు విఠల్‌రెడ్డిపై ఫోకస్ పెట్టారంటున్నారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి విఠల్‌రెడ్డి కూడా అత్యంత సన్నిహితుడు కావడంతో వీరిద్దరి నిర్ణయం ఒకేరకంగా ఉంటుందని అంటున్నారు.

మారనున్న సమీకరణలు

కాగా మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిలు బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారని జరుగుతున్న ప్రచారం ఇక్కడి రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు తావిస్తోంది. ఒకవేళ వీరిద్దరు పార్టీని వీడినట్లయితే రాజకీయ సమీకరణలు తలకిందులు కానున్నాయంటున్నారు. పార్టీ సీనియర్ నాయకులు, డీసీసీ అధ్యక్షులైన శ్రీహరిరావు, జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, న్యాయవాది మల్లారెడ్డి తదితరులు ఇంద్రకరణ్ రెడ్డి, విఠల్ రెడ్డిల చేరికపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు సైతం వీరిద్దరిని పార్టీలో చేర్చుకోవద్దంటూ బహిరంగంగానే వెల్లడిస్తున్నారంటున్నారు. పార్టీలో చేరికల వ్యవహారంపై డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు సైతం సీరియస్‌గా ఉన్నారంటున్నారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి రాకను శ్రీహరిరావుతో పాటు సీనియర్ నేతలంతా ఇప్పటి నుంచే అడ్డుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారంటున్నారు. ఇందులో భాగంగానే వీరంతా ఒకటి రెండు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఇక్కడి జిల్లాలోని వాస్తవ రాజకీయ పరిస్థితులను వివరించనున్నారంటున్నారు. బీఆర్ఎస్ పార్టీ నేతలపై ఉన్న ఆరోపణలు, విమర్శలను కాంగ్రెస్ పార్టీ మోయాల్సి వస్తుందని ఇలాంటి నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలన్న డిమాండ్‌ను కూడా తెరపైకి తెస్తున్నారు.

మహాశివరాత్రి వేడుకలకు శైవక్షేత్రాలు సిద్ధం



మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకుని తర్లపాడ్ ఓంకారేశ్వర ఆలయానికి విద్యుత్ దీపాలను అలంకరిస్తున్న దృశ్యం

ఖానాపూర్, మార్చి 7 : మహాశివరాత్రి పర్వదిన వేడుకలకు మండలంలోని శైవ క్షేత్రాలన్నీ సిద్ధమయ్యాయి. హిందువులు అత్యంత పవిత్రంగా భావించే మహాశివరాత్రి పర్వదిన వేడుకల కోసం మండల కేంద్రంలోని అతి పురాతనమైన మహాదేవాలయం, ఉత్తరవాహిని గోదావరినది తీరంలో గల శివగంగాగౌరీ ఆలయం, మార్కండేయ ఆలయంతో పాటు నిర్మల్, మంచిర్యాల రహదారిని ఆనుకొని పచ్చని చెట్ల నడుమ తర్లపాడ్ వద్ద అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో గల ఓంకారేశ్వర స్వామి ఆలయం, దిలావర్‌పూర్, రంగాపేట్ గ్రామాల్లోని శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి ఆలయాల్లో రెండు రోజులపాటు ప్రత్యేకపూజా కార్యక్రమాలు కొనసాగనున్నట్లు ఆలయ కమిటీ బృందాలు తెలిపాయి. మహాశివరాత్రి పర్వదినం వేడుకలను పురస్కరించుకొని తర్లపాడ్ ఓంకారేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు సాయంత్రం 7:15 గంటలకు ఆలయ ఆవరణలో శివపార్వతుల కళ్యాణం అనంతరం గ్రామంలో రాత్రి 11:30 గంటల వరకు పల్లకి ఊరేగింపు ఉంటుందని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులచే స్వామివారికి అభిషేకం నిర్వహిస్తామన్నారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఖానాపూర్‌లోని ఉత్తర వాహిని గోదావరి నది వద్ద ఏర్పాట్లు చేశారు. జాగరణ చేసే భక్తుల కోసం సైతం ఆలయాల్లో ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ బృందాలు తెలిపాయి.

భక్తుల సౌకర్యార్థం గోదావరి తీరంలో ఏర్పాట్లు పూర్తి

- మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యనారాయణ



గోదావరి నది తీరంలో షవర్ల ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

ఖానాపూర్, మార్చి 7 : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులు నదీతీరంలో అన్ని సౌకర్యాలను కల్పించినట్లు మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం అలియాస్ చిన్నం సత్యనారాయణ తెలిపారు. గురువారం నదీతీరంలో జరుగుతున్న ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ మనోహర్, వైస్‌చైర్మన్ కావలి సంతోష్‌లతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లల సౌకర్యార్థం నది తీరంలో షవర్లను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మహిళల సౌకర్యార్థం నదీతీరంలో బట్టలు మార్చుకునేందుకు గదులను సైతం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే వెడ్మబొజ్జు సహకారంతో ఎస్ఆర్ఎస్‌పీ నుంచి నీటివిడుదల చేయించామన్నారు. ఉత్తరం దిశగా ప్రవహించే నదిలో స్నానమాచరించడానికి పుణ్యపదంగా భావించి భక్తులు అధికసంఖ్యలో ఖానాపూర్ తీరానికి తరలిరానున్న నేపథ్యంలో వారికి ఎటువంటి ఇక్కట్లు కలగకుండా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టామన్నారు. నది తీరంలో గజ ఈతగాళ్లను సైతం అందుబాటులో ఉంచుతామన్నారు.



పతకాలు సాధించిన క్రీడాకారులతో కలెక్టర్

ఖేల్ ఇండియా క్రీడాకారులకు కలెక్టర్ అభినందన

నిర్మల్ కల్చరల్, మార్చి 7 : ఇటీవల జార్ఖండ్ రాష్ట్రంలో జరిగిన జాతీయ స్థాయి ఖేల్ ఇండియా క్రీడల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అభినందించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో ఆయన క్రీడాకారులు చదువుతో పాటు క్రీడా పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. 7వ ర్యాంకు సాధించిన ఎస్. మాధురితో పాటు తమిళనాడులో సబ్ జూనియర్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. పతకాలు, ప్రశంసా పత్రాలను అందించారు. డీవైఎస్‌వో నఫేఖాన్, వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ మాధవరావు పాల్గొన్నారు.

కరెంటు తీగల సాకుతో వృక్షాల నరికివేత

నర్సాపూర్(జి), మార్చి 7 : మండల కేంద్రంలోని అంగడి బజారులో విద్యుత్ స్తంభాలకు వృక్షాల కొమ్మలు తగులుతున్నాయనే సాకుతో మహా వృక్షాలను మొదటికే నరికివేస్తున్నారు. విద్యుత్ అధికారులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే గతంలో నరికివేస్తే పదిహేను వందల రూపాయల జరిమానా విధించారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి అధికారులు కుస్లి రోడ్డుకు ఇరువైపులా నరివేసిన వృక్షాల స్థానంలో చెట్లను పెంచాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఫైలేరియా వ్యాధి గుర్తించేందుకు ఇంటింటా సర్వే



సర్వేలో పాల్గొన్న వైద్యఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది

భైంసా, మార్చి 7 : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలోని ఏపీ నగర్ కాలనీలో బుధవారం రాత్రి వైద్య ఆరోగ్య శాఖ ఫైలేరియా వ్యాధి గుర్తింపు కోసం గాను ఇంటింటా సర్వే నిర్వహించింది. అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారిణి డా.ఫిర్దోస్ జబీన్, సీహెచ్‌వో గిరిబాబు, హెచ్‌ఈవో కన్నయ్య, హెల్త్ అసిస్టెంట్ కొత్తకొండ నరేష్, అజయ్ కుమార్ సారథంలోని వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది కాలనీ పరిధిలో ఇంటింటా సర్వే చేపట్టారు. రాత్రి 10 గంటల నుంచి ప్రారంభమైన సర్వే అర్ధరాత్రి వరకు కొనసాగింది. కాలనీ పరిధిలో 530 నివాసగృహాలలో సర్వే నిర్వహించిన వైద్యఆరోగ్య సిబ్బంది 300 మంది నుంచి రక్త నమునాలనే సేకరించారు. సంబంధిత నమునాలను పరీక్షల నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రికి తరలించారు. పరీక్షల్లో మైక్రో ఫైలేరియా క్రిమి ఉన్నట్లు గుర్తించబడిన బాధితులకు అవసరమైన చికిత్సలతో పాటు మందుల కిట్లను పంపిణీ చేయనున్నట్లుగా వైద్యాధికారిణి డా. ఫిర్దోస్ జబీన్ పేర్కొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి అల్లోల



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి అల్లోల

సారంగాపూర్, మార్చి 7 : మండలంలోని జౌళి గ్రామంలో ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన బంగ్లా ముత్యంరెడ్డి బాధిత కుటుంబాన్ని గురువారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పరామర్శించారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులకు అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈయన వెంట నాయకులు అల్లోల మురళీధర్‌రెడ్డి, వెంకట్‌రామ్‌రెడ్డి, రాజ్‌మహ్మద్, మాధవ్ రావు, భోజారెడ్డిలతో పాటు నాయకులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తా

- ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్

భైంసా, మార్చి 7 : ప్రణాళికబద్దమైన విధానాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి బాధ్యతతో కృషి చేస్తున్నామని ముథోల్ ఎమ్మెల్యే రాంరావ్ పాటిల్ పేర్కొన్నారు. గురువారం భైంసా పట్టణంలోని పిప్రి కాలనీలో మన ఊరు- మనబడి నిధుల ద్వారా నిర్మించిన పాఠశాల భవనాన్ని ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పన, సౌకర్యాల మెరుగుదలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లుగా వెల్లడించారు. ప్రాధాన్యతననుసారం ఆయా పాఠశాలల్లో అధనపు తరగతి గదుల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామన్నారు. చదువుతో ప్రగతి సాధ్యమవుతుందన్న విషయాన్ని ప్రతి విద్యార్థి గుర్తు పెట్టుకోవాలన్నారు. నేటి పోటీతత్వ యుగంలో రాణించేందుకు గాను చదువే ప్రధాన మార్గమన్నారు. ఉపాధ్యాయులు ఉత్తమ బోధన చేపట్టి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మార్గం సుగమం చేయాలని అకాంక్షించారు. పిప్రి కాలనీ ప్రభుత్వ పాఠశాల ప్రగతికి అంకితభావంతో పాటుపడిన మున్సిపల్ కౌన్సిలర్ చందులాల్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ ప్రత్యేక అభినందించి ఘనంగా సన్మానించి జ్ఞాపికలు బహూకరించారు. ఇందులో భైంసా ఎంపీపీ అబ్దుల్ రజాక్, ఎంఈవో సుభాష్, పీఆర్‌టీయూ నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రమణరావ్, బీజేపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్, ప్రతినిధులు సోలంకే భీంరావ్ పాటిల్ , బాజనొల్ల గంగాధర్, తూమొల్ల దత్తు, వడ్నపు శ్రీనివాస్, రావుల పోశెట్టిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళల పాత్ర కీలకం : ఎస్పీ జానకి షర్మిల



మాట్లాడుతున్న ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ కల్చరల్, మార్చి 7 : మహిళలు అన్నిరంగాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారని జిల్లా ఎస్పీ జానకి షర్మిల అన్నారు. గురువారం నిర్మల్‌లో భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన మహిళల సమావేశంలో మాట్లాడుతూ... మహిళలు సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని కొనియాడారు. మహిళలు సమానత్వం సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. మహిళలను మనుషుల్లాగా చూసి సమానంగా అవకాశాలు కల్పించడమే సమాజం ఆమెకు ఇచ్చే అరుదైన గౌరవమన్నారు. జీవితాన్ని ఓర్పుగా తీర్చిదిద్దేది మహిళ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ఎన్నో మార్పులు మహిళను ఆర్థికంగా సామాజికంగా బలోపేతం చేస్తున్నాయన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8న మహిళా అధికారులు, సిబ్బందికి సెలవు దినంగా ప్రకటించారు. మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళా ఉద్యోగులకు బహుమతులు అందించి ప్రోత్సహించారు. భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, ఏవో యూనుస్ అలీ, ఆర్ఐ శైలేందర్, సీఐ అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు మంది 231 విద్యార్థుల గైర్హాజరు



భైంసాలో పరీక్షాకేంద్రాన్ని డీఐఈవో జాదవ్ పరుశురామ్ తదితర అధికారుల బృందం

భైంసా, మార్చి 7 : ఇంటర్ పరీక్షల్లో భాగంగా గురువారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించి పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 231 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలోని 23 పరీక్షా కేంద్రాలలో మొత్తం 5819 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా ఇందులో 5588 మంది విద్యార్థులు హజరవ్వగా 231 మంది గైర్హాజరయ్యారు. జనరల్ కోర్సుకు సంబంధించి 4827 మంది విద్యార్థులకు 146 మంది, వొకేషనల్ కోర్సుకు సంబంధించి 907 మంది విద్యార్థులకు 85 మంది గైర్హాజరయ్యారు. భైంసాలోని పరీక్ష కేంద్రాలను గురువారం డీఐఈవో జాదవ్ పరుశురామ్ నేతృత్వంలో డీఈసీ ప్రతినిధులు రవి కిరణ్, వెంకటేశ్వరులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష నిర్వాహణ,ఏర్పాట్ల వ్యవస్థ పట్ల డీఈసీ ప్రతినిధులు బృందం సంతృప్తి వ్యక్తం చేసింది.

డిగ్రీ విద్యార్థులకు పోటీ పరీక్షలపై అవగాహన

నిర్మల్ కల్చరల్, మార్చి 7 : నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులకు పోటీ పరీక్షలు, ఉద్యోగ ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ ఫ్యాకల్టీ రమణగౌడ్, అల్లం సాయికృష్ణలు వివిధ పీజీ కోర్స్‌లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, కార్పొరేట్ ఉద్యోగ నియామకాల్లో పాటించాల్సిన మెళకువలు తెలియజేశారు. జనరల్ నాలెడ్జ్, సమకాలీన అంశాలపై వివరించారు. అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

15 నుంచి ఒంటిపూట బడులు



పాఠశాల విద్యార్థులు

భైంసా, మార్చి 7 : పెరుగుతున్న వేసవి తీవ్రత దృష్ట్యా ఈ నెల 15 నుంచి ఒంటిపూట బడులు నిర్వహించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు సంబంధిత విషయంలో పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి 15 నుంచి ఏప్రిల్ 23 (విద్యా సంవత్సరం ముగిసే వరకు) ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒంటిపూట బడులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో ప్రభుత్వం పెర్కొంది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు బడులు నడుపాలని స్పష్టం చేసింది.

ఇదే క్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్నం 12.30 గంటలకు మధ్యాహ్న భోజనం పెట్టి ఇళ్లకు పంపించాలని నిర్వాహకులకు ఉత్తర్వుల్లో ఆదేశించారు. పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు యధావిధిగా కొనసాగుతాని ఉత్తర్వులో స్పష్టం చేశారు. పది పరీక్షలు నిర్వహిస్తున్న కేంద్రాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు బడులు కొనసాగించాలని వెల్లడించారు.

సంక్షిప్త సమాచారం

ట్రాక్టర్ ఢీకొని వృద్ధుడి మృతి



లక్ష్మణచాంద, మార్చి 7 : ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో తోకల పోశన్న(70) అనే వృద్ధుడు మృతి చెందిన సంఘటన గురువారం తెలిసింది. ఎస్సై సల్లా శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం... ధర్మారం గ్రామానికి చెందిన పోశన్న తన టీవీఎస్- ఎక్సెల్ వాహనంపై బుధవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో కనకాపూర్ గ్రామంవైపు వెళ్తుండగా ఒక ట్రాక్టర్ పీచర శివారులోని దుబ్బ రాజేశుడు ఆలయ సమీపంలో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ట్రాలీ పోశన్న తలకు బలంగా తగలడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతుడి భార్య తోకల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు చేసి ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ గుంజశంకర్‌పై చట్టరీత్యా కేసునమోదు చేసినట్లు ఆయన వివరించారు.

11న సీజ్ చేసిన ఇసుక వేలం

దిలావర్‌పూర్, మార్చి 7 : మండలంలోని కాల్వ శివారులో ఇటీవల సీజ్ చేసిన అక్రమ ఇసుక డంపులను వేలం వేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. మండలంలోని కాల్వ శివారులోని స్వర్ణవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలించి కొంత మంది కాల్వ శివారులోనే డంపు చేశారు. సమాచారం తెలుసుకున్న జిల్లా మైనింగ్ అధికారి, ఎంఆర్ఐ సంతోష్ అక్రమ డంపులను సీజ్ చేశారు. అయితే సుమారు 153 ట్రాక్టర్ల మేర ఉన్న ఇసుక డంపులను ఈ నెల 11న మధ్యాహ్నం వేలం వేయనున్నట్లు ఎం ఆర్ఐ సంతోష్ తెలిపారు. ఆసక్తి గలవారు ఒక్క ట్రాక్టర్ ప్రభుత్వ ధర ప్రకారం రూ. 1800ల నుంచి వేలం వేయడం జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనేవారు ఒక్క ట్రాక్టర్ ఇసుకకు రూ. 900ల చొప్పున 153 ట్రాక్టర్లకు రూ. 1,37,700లను దిలావర్‌పూర్ తహసీల్దార్ పేరున డీడీ రూపంలో తీసి వేలంలో పాల్గొనాలని సూచించారు. డీడీతో పాటు ఆధార్‌కార్డు, అప్లికేషన్‌తో వచ్చి వేలంలో పాల్గొనాలని కోరారు. వేలం అనంతరం మిగతా డబ్బులు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



సారంగాపూర్, మార్చి 7 : మండలంలోని జాం గ్రామానికి చెందిన రమేష్ అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత రెండురోజుల క్రితం విధులు ముగించుకొని స్వర్ణ నుంచి జాం గ్రామానికి మోటార్ సైకిల్‌పై తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరగడంతో చికిత్స నిమిత్తం కోసం నిర్మల్ ఆసుపత్రికి తీసుకెళ్లగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.